క్లుప్తంగా

వైఎస్సార్‌ సీపీ ఎస్సీ సెల్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ



రామకృష్ణను అభినందిస్తున్న ఎంపీ గీత

పిఠాపురం: రాష్ట్ర వైఎస్సార్‌ సీపీ ఎస్సీ సెల్‌ ప్రధాన కార్యదర్శిగా పిఠాపురం మండలం చిత్రాడకు చెందిన గుడాల రామకృష్ణని నియమిస్తూ పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయన పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ అభ్యర్థి వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబులను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకం ఉంచి పదవీ బాధ్యతలు అప్పగించినందున పార్టీ విజయానికి కృషి చేసి ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటామని తెలిపారు. ఆయనను పలువురు వైఎస్సార్‌ సీపీ నేతలు అభినందించారు.

రీసర్వే డీటీ నియామకం అభ్యంతరకరం

సామర్లకోట: స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో సుమారు ఐదేళ్ల పాటు పని చేసిన వ్యక్తిని బదిలీ చేసి తిరిగి అదే కార్యాలయంలో పోస్టింగ్‌ ఇవ్వడంపై జిల్లా మానవహక్కు సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ అభ్యంతరం వ్యక్తం చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ డిప్యూటీ తహసీల్దార్‌ హోదాలో ఉన్న వ్యక్తిని బదిలీ చేసి తిరిగి రీసర్వే డీటీగా నియమించడం వెనుక రహస్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కలెక్టర్‌తో పాటు ఎన్నికల అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి



భవిత సెంటర్‌లో అందుతున్న గృహ ఆధారిత విద్యను పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

పెద్దాపురం: విభిన్న ప్రతిభా వంతులకు ప్రభుత్వం భవిత సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహిత విద్య సమన్వయ కర్త చామంతి నాగేశ్వరావు అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్‌ పాఠశాలలోని భవిత సెంటర్‌ ద్వారా విభిన్న ప్రతిభా వంతులకు అందిస్తున్న గృహ ఆధారిత విద్య సేవలపై శనివారం ఆయన ఆరా తీశారు. విభిన్న ప్రతిభావంతుల ఇంటికి వెళ్లి విద్యనందిస్తున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు, భవిత సెంటర్‌ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు హామీతో శాంతించిన వర్మ

పిఠాపురం: చంద్రబాబు హామీతో మాజీ ఎమ్మెల్యే వర్మ జనసేన అధినేతతో కలిసిపోయారు. పవన్‌ కల్యాణ్‌ గెలుపే తన లక్ష్యం అని పేర్కొన్నారు. నాలుగు రోజులుగా తీవ్ర ఆందోళనలు చేసిన టీడీపీ కేడర్‌ వర్మ తాజా నిర్ణయంతో తమను ఎందుకు వీధుల పాలు చేయడమని తిట్టుకుంటున్నారు. పార్టీ జెండాలు పట్టేది లేదని ఆందోళన వ్యక్తం చేసిన వర్మ వర్గీయులు ఇప్పుడు జనసేన జెండాలు పట్టుకోవాలా అంటు ప్రశ్నిస్తున్నారు. శనివారం చంద్రబాబును కలిసిన వర్మ బాబు హామీతో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసేది లేదని తేల్చి చెప్పారు.

సరిహద్దుల్లో పోలీస్‌ చెక్‌పోస్ట్‌

తుని రూరల్‌: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కాకినాడ, అనకాపల్లి జిల్లాల సరిహద్దులో 16వ నంబర్‌ జాతీయ రహదారిపై తుని రూరల్‌ పోలీసులు చెక్‌పోస్ట్‌ ఏర్పాటు చేశారు. శనివారం కాకినాడ జిల్లా ఎస్పీ, పెద్దాపురం డీఎస్పీ ఆదేశాల మేరకు చెక్‌పోస్ట్‌ ఏర్పాటు చేసినట్టు రూరల్‌ ఎస్సై డి.రమేష్‌ బాబు తెలిపారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు రాజకీయ పార్టీలు అక్రమంగా తరలించే నగదు, నగలు, గృహ ఉపయోగ వస్తువులను అరికట్టేందుకు ఈ చెక్‌పోస్ట్‌లో నిరంతరం నిఘా కొనసాగిస్తామన్నారు. 24 గంటలు తమ సిబ్బంది వాహనాలను తనిఖీలు చేస్తారని, అనుమతి, ఆధారాలు లేని వస్తువులు, నగదు స్వాధీనం చేసుకుంటామన్నారు. ఏమైనా వస్తువులు, నగదు, నగలు తరలిస్తే సంబంధిత వ్యక్తులు, వాహనదారుల వద్ద బిల్లులు ఉంచుకోవాలన్నారు.

వ్యాక్సిన్లకు ఎంతో ప్రాధాన్యం

బోట్‌క్లబ్‌: ప్రాణాంతక వ్యాధులపై పోరాటంలో వ్యాక్సిన్ల ప్రాముఖ్యం ఎంతో ఉందని ఇండియన్‌ డెంటల్‌ అసోసియేషన్‌ రాష్ట్ర కన్వీనర్‌ అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక బోట్‌ క్లబ్‌ పార్కులో శనివారం ప్రజల కు జాతీయ వాక్సినేషన్‌ దినోత్సవం సందర్భంగా ఐడీఏ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీకాలు వేయడం ఆధునిక వైద్యానికి మూలస్తంభమని, ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్యం శ్రేయస్సును మెరుగుపరచడంలో అవి ముఖ్యమైన పాత్ర పోషించాయన్నారు.

20 ఏళ్ల నిరీక్షణ ఫలించింది

- పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు



సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని 20 ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నం నేటికి నెరవేరిందని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. శనివారం ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించిన సందర్భంగా దొరబాబు విలేకర్లతో మాట్లాడారు. సుమారు ఐదేళ్లుగా కోఆర్డినేటర్‌గా నియోజకవర్గంలో పని చేస్తున్నాను. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర చేస్తూ కాకినాడ వచ్చిన సందర్భంగా అచ్చంపేటలో వైఎస్సార్‌ సీపీలో చేరాను. జగనన్న కాలనీ ప్రారంభోత్సవానికి వచ్చిన సమయంలో మొట మొదటి టిక్కెట్టు జగన్‌ తనకే ప్రకటించారని, అయినా కొందరు తప్పుడు పోస్టింగ్‌ పెడుతూనే ఉన్నారని, వాటి అన్నిటికి చెక్‌ పెడుతూ ముఖ్యమంత్రి కోఆర్డినేటర్లుగా పని చేస్తున్న వారందరికీ ఎమ్మెల్యే టిక్కెట్లు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉన్నదన్నారు. తనను అభ్యర్థిగా ప్రకటించి నందుకు సీఎం జగన్‌కు దొరబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో అన్ని గ్రామాలను గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నానన్నారు. నియోజకవర్గంలో సామర్లకోటకు చెందిన వ్యక్తిని కావడంతో నియోజకవర్గంపై పూర్తి స్థాయిలో అవగాహన ఉందన్నారు. హామీలకే పరిమితమైన సామర్లకోట ప్రభుత్వ జూనియర్‌ కళాశాల డిగ్రీ కళాశాలగా చేయడానికి సీఎం జగన్‌ అంగీకరించారని తెలిపారు. మహ్మద్‌ ఇస్మాయిల్‌, ఉండవిల్లి నారాయణమూర్తిల ఆధ్వర్యంలో మాత్రమే నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. నియోజకవర్గ ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధిని కోరుకొంటున్నారని, ప్రజలకు అందుబాటులో ఉండి ప్రతి సమస్య పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. నియోజకవర్గంలో ఘన విజయం సాధిస్తామనే ధీమా వ్యక్తం చేశారు. సీఎం జగన్‌ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తమ విజయానికి పునాది అని అన్నారు. టిక్కెట్టు ఖరారు కావడంతో నియోజకవర్గ పరిధిలోని కార్యకర్తలను అందరినీ కలుసుకొని వారి సహకారంతో ఎన్నికల ప్రచారం నిర్వహించి విజయం సాధిస్తామని తెలిపారు.

బయోడేటా

పేరు : దవులూరి దొరబాబు
విద్యార్హతలు: బి.టెక్‌
తల్లిదండ్రుల పేర్లు: దవులూరి పార్వతి, సుబ్బారావు
భార్య పేరు : దవులూరి చంద్రకళ
పిల్లలు: కుమార్తెలు, ప్రణవి, సార్విక
రాజకీయ నేపథ్యం : ప్రజా సేవా
చేపట్టిన కార్యక్రమాలు : దవులూరి చారిటబుల్‌ ట్రస్టు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు
ఇతర వివరాలు: సాఫ్ట్‌వేర్‌ రంగంలో పరిశ్రమలు

ప్రత్యర్థి ఎవరైనా విజయం నాదే

- పిఠాపురం వైఎస్సార్‌ సీపీ అభ్యర్థి వంగా గీత



పిఠాపురం: రాష్ట్రంలో అత్యంత కీలకంగా ఉన్న పిఠాపురం నియోజకవర్గంలో పోటీకి ఒక మహిళకు సీఎం జగన్‌ అవకాశం ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని ప్రత్యర్థి ఎవరైనా గెలుపు తమదే అవుతుందని వైఎస్సార్‌ సీపీ అభ్యర్థి వంగా గీత ధీమా వ్యక్తం చేశారు. పిఠాపురం అభ్యర్థిగా పార్టీ అధిష్టానం తన పేరును ఖరారు చేసిన సందర్భంగా శనివారం ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌ ప్రజల మనిషిగా గుర్తింపు తెచ్చుకున్నారు. 2019కి ఇప్పటికి చాలా మార్పు వచ్చింది. రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగింది. మేనిఫెస్టోని వంద శాతం అమలు చేశారన్నారు. ఆయనకు ప్రజల మద్దతు వంద శాతం ఉంది. అందువల్ల ఆయన మమ్మల్ని వారి ప్రతినిధిగా సీటు ఇచ్చి నిలబెట్టారు. ఆయనకు ఉన్న ప్రజాదరణే మా విజయానికి సోపానాలు అవుతాయన్నారు. పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌ కల్యాణ్‌ పోటీ చేస్తున్న నేపథ్యంలో మీగెలుపు బాట ఎలా ఉంటుందని మీడియా అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం చెబుతూ ఎన్నో ఏళ్లుగా రాజకీయ అనుభవం ఉన్న తనకు ముఖ్యమంత్రి చేసిన ప్రజా సంక్షేమం తోడవ్వడంతో ప్రత్యర్థులు ఎవరైనా తన గెలుపును ఆపడం అసాధ్యమన్నారు. ప్రతిపక్షంలో జనసేన, టీడీపీ, బీజేపీ మూడు పార్టీలు కలిసి వస్తున్నాయి ఇప్పుడు ప్రకటించిన అభ్యర్థులు వాళ్లే ఉంటారని నమ్మకం లేదు. మార్పులు జరగవచ్చు స్వతంత్ర్య అభ్యర్థులుగాను పోటీలో ఉండొచ్చు అయినప్పటికీ తన గెలుపును ఆపే శక్తి ఎవరికీ ఉండదన్నారు. జనానికి అడిగింది ఇచ్చి కావాల్సింది ఇచ్చిన ఒకే ఒక్క నేత జగన్‌ అన్నారు. పిఠాపురం ఇంటి బిడ్డనని, ఇక్కడి ప్రజల్లో ఒక సుస్థిర స్థానం సంపాదించుకున్న మహిళనని ఇక్కడ అందిరితో సత్సంబంధాలు కలిగిన వ్యక్తిగా తనను ఇక్కడి జనం గెలిపిస్తారన్నారు.

బయోడేటా

పూర్తి పేరు – వంగా గీత
విద్యార్హత – ఎంఏ, ఎంఏ, ఎల్‌ఎల్‌బీ
ప్రస్తుత హోదా – కాకినాడ లోక్‌సభ సభ్యురాలు
కుటుంబం – భర్త కాశీ విశ్వనాథం, కుమార్తె సత్య పావని
రాజకీయ నేపథ్యం – 1996లో జెడ్పీ చైర్‌పర్సన్‌, 2000లో రాజ్యసభ సభ్యురాలు, 2009లో పిఠాపురం ఎమ్మెల్యే, ప్రస్తుతం కాకినాడ ఎంపీ.
చేపట్టిన సామాజిక కార్యక్రమాలు: కాకినాడ జిల్లాలో 6 రైల్వే అండర్‌ బ్రిడ్జిలు, కాకినాడలో 100 పడకల ఈఎస్‌ఐ ఆసుపత్రి, జేఎన్‌టీయూకేలో సింథటిక్‌ కోర్టు, కేంద్రీయ విద్యాలయం, ఆయుష్‌ ఆస్పత్రి, ఉప్పాడలో హోటల్‌ మేనేజ్‌మెంట్‌ కాలేజీ, ఐఐఎఫ్‌టీ కాలేజీ నిర్మాణాలు. ఇప్పటి వరకూ విడుదలైన ఎంపీ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు.

95 శాతం పోలింగ్‌ లక్ష్యం

- 85 ఏళ్లు దాటితే ఇంటి వద్దే ఓటు
- కోడ్‌ అమలుకు రాజకీయ పార్టీలు సహకరించాలి
- రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను సత్వరమే తొలగించాలి
- ఈఆర్వో, ఆర్డీఓ జేఎస్‌ రామారావు

పెద్దాపురం: గతమెన్నడూ లేని విధంగా భారత ఎన్నికల సంఘం ఈ దఫా సార్వత్రిక ఎన్నికల్లో 85 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటివద్దనే ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకుందని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో స్వీప్‌ ఆధ్వర్యంలో 95 శాతం పోలింగ్‌ లక్ష్యంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి, ఆర్డీఓ జేఎస్‌ రామారావు అన్నారు. భారత ఎన్నికల సంఘం శనివారం సాయంత్రం ఎన్నికల షెడ్యూల్డ్‌ విడుదల చేసిన సందర్భంగా ఈసీ ఆదేశాల మేరకు ఆయన పాత్రికేయుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో 1,04,611 మంది పురుష ఓటర్లు, 1,07,956 మంది మహిళా ఓటర్లు, 12 మంది ఇతరులు వెరసి 2,12,579 మంది ఓటు హక్కు కల్గి ఉన్నారన్నారు. వీరిలో 85 ఏళ్లు దాటిన 938 మంది ఓటర్లను గుర్తించామన్నారు. అదే విధంగా 40 శాతం అంగవైకల్యం కల్గిన 3009 మంది ఓటర్లను గుర్తించి వారికి ఇంటి వద్దే ఓటు హక్కు వేసుకునేలా ఈసీ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో 200 పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేశామని, వీటిలో 46 సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాలను గుర్తించామన్నారు. అన్ని పోలింగ్‌ కేంద్రాల వద్ద వెబ్‌కాస్టింగ్‌, సీసీ కెమేరా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్డ్‌ విడుదల నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను 24 గంటల్లో తొలగించాలన్నారు. బహిరంగ, ప్రైవేట్‌ స్థలాల్లో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను 48 గంటల్లో తొలగించాలన్నారు. లేని పక్షంలో ఈసీ చర్యలకు బాధ్యులవుతారని ఆర్డీఓ హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ర్యాండమేషన్‌ ఆయా పార్టీల అభ్యర్థుల సమక్షంలోనే జరుగుతుందని, ఏ బూత్‌కు ఏ ఈవీఎం వస్తుందో నెంబర్‌తో సహా చూపించే స్ట్రాంగ్‌ రూమ్‌ల్లో పెట్టడం జరుగుతుందన్నారు. సోషల్‌ మీడియాలో వస్తున్న ఈవీఎం ట్యాంపరింగ్‌ అనే అపోహలను ప్రజలు విడనాడి, ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రక్రియకు సహకరించాలన్నారు. ఎన్నికల ప్రక్రియలోకి గ్రామ వలంటీర్లను తీసుకు వచ్చే ప్రసక్తే లేదని, రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద ప్రభుత్వ ఉద్యోగులు గాని, వలంటీర్లుగాని ఉంటే ఈసీ తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని ఈఆర్వో హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంతా మోడల్‌ కోడ్‌ ఆఫ్‌ కాంటాక్ట్‌ (ఎంసీసీ) నాలుగు టీములు, ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ మూడు టీములు, వీడియో సర్వేలైన్స్‌ (వీఎస్‌టీ) రెండు టీములు, ఎస్‌ఎస్‌టీ మూడు టీములు, 22 మంది సెక్టార్‌, 22 మంది రూట్‌ ఆఫీసర్లను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే ఈవీఎంలపై 424 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఎవరైనా ఫిర్యాదు చేయాలనుకుంటే ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్‌ ఫ్రీ నెంబర్‌ 08852241254 నెంబర్‌కు తెలియపర్చాలని ఆర్డీఓ సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది పీఓ, ఏపీఓ (టీచర్లు)కే కాకుండా ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఉద్యోగి కారు డ్రైవర్‌తో సహా పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని జేఎస్‌ రామారావు అన్నారు. ఎన్నికల ప్రశాంత వాతావరణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏఈఆర్‌ఓలు పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్‌ కమిషనర్లు పద్మావతి, రామారావు, ఆర్డీఓ కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం, పెద్దాపురం తహసీల్దార్‌ శ్రీనివాసరెడ్డి తదితరులు న్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పెద్దాపురం ఆర్‌ఓ, ఆర్డీఓ రామారావు

ఘనంగా అమరజీవి జయంతి



సామర్లకోటలో అమరజీవికి నివాళులు అర్పించిన చైర్‌పర్సన్‌ అరుణ, కమిషనర్‌ రామారావు



శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓ జేఎస్‌ రామారావు ఆయనకు నివాళుర్పించారు. కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం, డీటీలు భానుకుమార్‌, రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ జి.ఉషారాణి, ఈఓపీఆర్డీ రాజశేఖర్‌, సిబ్బంది, మున్సిపల్‌ కార్యాలయంలో మున్సిపల్‌ మేనేజర్‌ జ్యోతిరాణి అధ్యక్షతన కమిషనర్‌ పద్మావతి, సిబ్బంది పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పించారు.

సామర్లకోటలో..

సామర్లకోట: మున్సిపల్‌ కార్యాలయంలో చైర్‌ పర్సన్‌ గంగిరెడ్డి అరుణ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కమిషనర్‌ జె రామారావు, తదితర సిబ్బంది అమరజీవికి నివాళులు అర్పించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్‌ ఆధ్వర్యంలో ఈఓపీఆర్డీ తదితరులు, తహసీల్దార్‌ కార్యాలయంలో సర్వే డీటీ పి.శ్రీనివాసు ఆధ్వర్యంలో, బచ్చు ఫౌండేషన్‌ మున్సిపల్‌ హైస్కూల్స్‌లో హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో అమరజీవికి నివాళులు అర్పించారు. మఠంసెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహనికి మాజీ మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ యార్లగడ్డ చిన్ని, రైతు సంఘ అధ్యక్షుడు కంటే బాబు, కౌన్సిలర్‌ బలుసు వాసు తదితరులు నివాళులు అర్పించారు.

పేదలను ఆదుకునేది సీఎం జగన్‌ ఒక్కరే

- లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు పంపిణీ చేసిన వంగా గీత



లబ్ధిదారులకు చెక్‌లు పంపిణీ చేస్తున్న కాకినాడ ఎంపీ గీత

పిఠాపురం: నిరుపేదలకు వైద్య ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంలోను వారికి ఆర్థిక భరోసా కల్పించడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ ఇన్‌చార్జ్‌ వంగా గీత అన్నారు. ఆమె శనివారం గొల్లప్రోలు మండల పరిషత్‌ కార్యాలయంలోను, పిఠాపురం క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్‌ చెక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు గొల్లప్రోలు నగర పంచాయతీ, మండలం, పిఠాపురం పట్టణ, మండల, కొత్తపల్లి మండలాల పరిధిలో 55 మంది కుటుంబాలకు చెందిన లబ్ధిదారులకు రూ.37 లక్షల చెక్‌లను పంపిణీ చేశామన్నారు. వ్యాధుల బారిన పడి వైద్యం చేయించుకోలేక నిస్సహాయంగా ఉన్న అభాగ్యులకు సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. లబ్ధిదారుల తరపున వారి కుటుంబాల తరపున సీఎం వైఎస్‌ జగన్‌కు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో ఆదివారం ఉదయం నుంచి షుగర్‌, బీపీ పరీక్షలు ఉచితంగా చేయడానికి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు విన్నకోట సురేష్‌ తెలిపారు. ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. బీపీ, షుగర్‌ రోగులు వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందాలన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన్నట్టు రెల్వే పోలీసులు శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 55 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి రెండో నెంబరు ప్లాట్‌ఫాం శివారులోని పట్టాల మధ్యలో ఉన్నట్లు రైల్వే సూపరింటెండెంట్‌ శ్రీధర్‌ నుంచి సమాచారం వచ్చిందన్నారు. ఆయన సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించక పోవడంతో గుర్తు తెలియని మృత దేహంగా కేసు నమోదు చేశారు. మృతుడు పసుపు రంగుపై పువ్వుల డిజైన్‌ కలిగిన ఫుల్‌హ్యాండ్స్‌ టీషర్టు, నీలం రంగు జీన్‌ ప్యాంటు ధరించి ఉన్నాడని, 5'7 ఎత్తు ఉండి నలుపు రంగులో ఉన్నట్లు తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టమ్‌ నిమిత్తం పెద్దాపురం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే ఎస్సై బి.లోవరాజు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలి

- మున్సిపల్‌ కమిషనర్‌ రామారావు



ఎన్నికల అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్‌ రామారావు

సామర్లకోట: ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని మున్సిపల్‌ కమిషనర్‌ జె.రామారావు అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్‌ కమిషనర్‌ చాంబర్‌లో మున్సిపల్‌ అధికారులు, సచివాలయ అడ్మిన్‌, టౌన్‌ ప్లానింగ్‌ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌ విడుదలైన తరువాత ప్రతి ఒక్కరూ ఎన్నిక కమిషన్‌ పరిధిలో పని చేయాల్సి ఉంటుందని, ఎవరికీ సెలవులు ఉండవని వివరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల చిత్రాలను తొలగించాలన్నారు. తదుపరి ముఖ్యకూడలి, బహిరంగ ప్రదేశాలల్లో ఉన్న వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, వాల్‌ పోస్టర్లను తొలగించాలన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని సూచించారు. ఎన్నికల కౌంటింగ్‌ పూర్తి అయ్యే వరకు ఎన్నికల కమిషన్‌ నిబంధనలు అమలులో ఉంటాయని చెప్పారు. నోటిఫికేషన్‌ తరువాత అధికారులు ప్రజా ప్రతినిధుల సమావేశాలల్లో పాల్గొనడం నేరమని హెచ్చరించారు. వలంటీర్లకు ఎటువంటి పనులు అప్పగించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ ప్లానింగ్‌ అధికారి ఫణికుమార్‌, శానిటరీ ఇన్‌స్పెక్టరు పి.శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లోక్‌ అదాలత్‌లో 241 కేసుల పరిష్కారం



ఫుడ్‌ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న జడ్జి

పెద్దాపురం: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ స్థాయి లోక్‌ అదాలత్‌లో 241 కేసులు పరిష్కరించినట్లు ఏడో అదనపు జిల్లా జడ్జి చంద్రమౌళీశ్వరి తెలిపారు. శనివారం స్థానిక కోర్టు మూడు బెంచ్‌ల్లో న్యాయమూర్తులు దీపా దివ్యకృప, హర్షవర్ధన్‌లు లోక్‌ అదాలత్‌ కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా సివిల్‌ కేసులు 54కు గాను రూ.88,07,244, క్రిమినల్‌ కేసులు 21, ఆరు మోటారు వాహనాల ప్రమాదాల కేసులకు గాను రూ.33,30,000, ప్రీ లిటిగిషన్‌ బ్యాంక్‌ కేసులు 18కి గాను రూ.7,91,846, బిఎస్‌ఎన్‌ఎల్‌ కేసులు 28కి గాను రూ.32,729, క్రిమినల్‌ చలానా కేసులు 116కి గాను రూ.1,69,860 పరిష్కరించినట్లు జడ్జి జి.చంద్రమౌళీశ్వరి తెలిపారు. అనతంరం కక్షిదారులకు శ్రీరామ్‌ ఫైనాన్స్‌ సంస్థచే ఏర్పాటు చేసిన ఫుడ్‌ ప్యాకెట్లను జడ్జి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం నాయకులు నూతలపాటి అప్పలకొండ, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్ర స్వామి జయంతి

బోట్‌క్లబ్‌: రాఘవేంద్ర స్వామి జయంతి సందర్భంగా శనివారం మధ్వ పురోహితులు యాతగిరి మధ్వేష్‌ ఆధ్వర్యంలో బొల్లంగి ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న రాఘవేంద్ర స్వామి బృందావనానికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్వేష్‌ మాట్లాడుతూ భక్తుల కోరికలను తీర్చే కల్పవృక్షంగా రాఘవేంద్ర స్వామిని అందరూ ఆరాధిస్తున్నారన్నారు. అవతారం విశేషాలను వివరించారు.

శ్రీకృష్ణదేవరాయలు విగ్రహావిష్కరణ



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న కురసాల సత్యనారాయణ తదితరులు

కాకినాడ రూరల్‌: కాకినాడ ప్రజల కల నెరవేరింది. దేశ భాషలందు తెలుగు లెస్స అని మన భాషను ప్రపంచానికి చాటిన మహారాజు శ్రీకృష్ణదేవరాయలు. ఆంధ్ర భోజ బిరుదాంకితుడిగా తెలుగు ప్రజల గుండెల్లో కొలువైన శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం కాకినాడలో ఏర్పాటు చేయాలనేది ఎందరో అభిమానుల కల. అది నెరవేరింది. కాకినాడ ఆర్డీవో కార్యాలయం కూడలి వద్ద ఆంధ్ర కాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని శనివారం ఉదయం శ్రీకృష్ణదేవరాయ స్మారక వేదిక గౌరవ అధ్యక్షుడు కురసాల సత్యనారాయణ, కాపు సద్భావన సంఘ నేతలు బసవా ప్రభాకర్‌రావు, చిట్నీడి శ్రీనివాసరావు, తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కురసాల సత్యనారాయణ మాట్లాడుతూ కాకినాడ నగరంలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం పెట్టాలని కోరుకుంటున్నారని, సురేష్‌నగర్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సహకారంతో కాపు సద్భావన సంఘం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల వారు విగ్రహం ఏర్పాటులో భాగస్వాములయ్యే శ్రీకృష్ణదేవ రాయులుపై ఉన్న అభిమానం చాటుకున్నారన్నారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం సురేష్‌నగర్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు గొల్లపల్లి బుజ్జి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో సేతు మాధవరావు, రెడ్నం రాజా, బిందాన సురేష్‌ తదితరులు మాధవరపు పట్టాభిరామయ్య, దామిశెట్టి శ్రీనివాస్‌, కర్నాసుల సత్యనారాయణ, నిరంజన్‌ నాయుడు, కోన ఉమేష్‌, అడబాల సత్యనారాయణ, కాలనీ వాసులు రవిరాజు, అడ్డాల శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బతుకు బాటకు జగనన్న బాసట

- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై హర్షాతిరేకాలు
- ఉన్నత చదువులు.. పెద్ద కొలువుల్లో యువత




పాదయాత్రలో విద్యార్థులతో నడుస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్‌)

పెద్దాపురం: గత ఐదేళ్ల కిందట పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా ఉండేది. నిరుపేద కుటుంబాల్లో పుట్టిన ఎందరో ప్రతిభావంతులు అధిక ఫీజులు చెల్లించలేక అర్థంతర చదువులతో పనిబాట పట్టేవారు. అలాంటి ఎందరో పేద విద్యార్థులకు నేనున్నాంటూ మహానేత దివంగత వైఎస్సార్‌ పుణ్యమా అని ఫీజు రీయింబర్స్‌మెంట్‌ ద్వారా తమ చదువులు పూర్తి చేసుకుని ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడిన వారు అనేకం ఉన్నారు. ఉన్నత ఆశయాలతో మహానేత తీసుకువచ్చిన ఈ పథకానికి ఐదేళ్ల కిందట టీడీపీ ప్రభుత్వం క్రమక్రమంగానే కనుమరుగయ్యే పరిస్థితికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో తండ్రి ఆశయాలతో ఆయన తనయుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన నవరత్నాల్లాంటి మాటలతో మళ్లీ పేద విద్యార్థుల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్‌ హామీని అమలు చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆనందోత్సాహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

నాటికీ నేటికీ ఎంత తేడానో....!


నాడు దివంగత నేత వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి విద్యార్థులందరికీ పూర్తి స్థాయిలో ఫీజు చెల్లించారు. గత టీడీపీ ప్రభుత్వం 30 వేల రూపాయలకు మించి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ ఇవ్వకపోగా అవి కాస్త కూడా బ్యాంక్‌ ఖాతాల్లో జమ అయిన దాఖలాల్లేవు. ఉన్నత విద్యనభ్యసించాలన్న పేద విద్యార్థుల కల అడియాశలుగా మారుతున్న తరుణంలో ప్రజానేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల్లోని ఫీజు రీయింబర్స్‌మెంట్‌ అమలు తీరు అద్వితీయం. ఆ ఆనందం విద్యార్థుల మాటల్లో చూద్దామా..

భవిష్యత్‌పై ఆశాజ్యోతి




ఆర్థిక స్తోమత లేక ఉన్నత చదువులు చదవలేమనే భావనను ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ప్రస్తుత ప్రభుత్వం పారదోలింది. జీవితంలో ప్రతి ఒక్కరూ జీవనోపాధి లేదా స్వయం ఉపాధి పొందే అవకాశం ఉంది. ఈ పథకం భవిష్యత్‌ల్లో ఎన్నో కుటుంబాలకు ఆశాజ్యోతిగా నిలుస్తోంది. – **బండి నవరత్నకుమారి,** బీఎస్సీ, గోరింట, పెద్దాపురం మండలం

భవితకు బంగారుబాట




ప్రైవేట్‌ కళాశాలల్లో ఫీజులు చెల్లించలేక రాష్ట్రంలో ఎంతోమంది పేద విద్యార్థుల చదువులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. అలాంటి వారి చదువులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో మళ్లీ కొనసాగుతాయి. విద్యార్థుల భవితకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ ఎంతో తోడ్పడుతోంది. – **బి.నీలాంబరి,** డిగ్రీ విద్యార్థిని, రాయభూపాలపట్నం, పెద్దాపురం మండలం

పేద విద్యార్థులకు అవకాశం



జగనన్న అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ పథకం బాగుంది. పేద విద్యార్థులకు లక్ష నుంచి లక్షన్నర వరకు ఫీజు చెల్లించడం భోజన, వసతి అదనంగా మరో 20 వేల రూపాయలు ఇవ్వడమనేవి హర్షించదగ్గ విషయం. ఈ పథకాలతో విద్యాభివృద్ధే గాక, విద్యావకాశాలు లభించాయి. – **కురిమెళ్ల లోవరాజు,** మ్యాథ్స్‌ లెక్చరర్‌, చంద్రమాంపల్లి

తండ్రిలా మాటపై నిలబడతారు



వైఎస్సార్‌ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ పథకం పేద విద్యార్థులకు వరంలా మారింది. జగన్‌ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక తన తండ్రిలా తిరిగి ఆ పథకాలన్నీ అమలు చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే వంశం వైఎస్సార్‌ కుటుంబం. – **మద్దాల శ్రీను,** విద్యార్థి తండ్రి, సామర్లకోట